క్లుప్తంగా

మహిళపై దాడి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లి పంచాయతీ అవులరెడ్డిపల్లిలో ఇంటి ఎదుట మురుగు నీటి విషయంలో ఇరు కుటుంబాల వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో పి.శంకర్ (32) అనే వ్యక్తి వేదాంతమ్మ అనే మహిళపై దాడి చేయడంతో తలకు గాయమైంది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం పూరవాండ్లపల్లెకు చెందిన రామమోహన్‌రెడ్డి(26) శుక్రవారం రాత్రి ఇంటి వద్ద విషం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇటీవల తన కుమార్తె అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో మనస్తాపం చెందిన ఆయన ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె మండలం చీకలబైలుకు చెందిన రమణ కుమారుడు వెంకటేష్(20) కుటుంబ సమస్యల కారణంగా శుక్రవారం రాత్రి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ నేమలగుండ్లపల్లెకు చెందిన హరిప్రసాద్ భార్య లక్ష్మీదేవి(30) కుటుంబసమస్యల కారణంగా శనివారం ఉదయం గన్నేరుపప్పు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అందరికీ ఆదర్శం వైఎస్సార్



చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి

మదనపల్లె సిటీ: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అందరికి ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి అన్నారు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి పురస్కరించుకుని శనివారం స్థానిక అమ్మచెరువుమిట్ట సమీపంలో ఉన్న వెలుగు పాఠశాలలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. దివ్యాంగులకు స్వీట్లు పంచిపెట్టారు. మాజీ కౌన్సిలర్ సురేంద్ర, రాజేంద్రనాయుడు, భువనేశ్వరి సత్య, సాయిశేఖర్‌రెడ్డి, మల్లిక, నల్లచెరువుబాషా, శ్రీనాథ్, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో ఎస్వీ మెడికల్ కాలేజీ వైద్య బృందం



మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయ భవనంలో చర్చిస్తున్న ఎస్వీ మెడికల్ కాలేజీ వైద్య బృందం

మదనపల్లె : మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఎస్వీ మెడికల్ కాలేజీ వైద్యబృందం శనివారం పరిశీలించింది. ఎస్వీ మెడికల్ కళాశాల వైద్య బృందం, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ బృందం ఉమ్మడిగా మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ బృందంలో ప్రిన్సిపల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ వసుంధరదేవి, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కిరిటీ, జనరల్ సర్జరీ నిపుణులు శ్రీకాంత్‌రెడ్డి, అనాటమీ ప్రొఫెసర్ జగదీష్, ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనుంజయరెడ్డిలు ఉన్నారు. వారు స్థానిక జిల్లా ఆస్పత్రి ఆర్ఎంఓ, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్‌రాజులతో కలిసి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని, ప్రసూతి, మేల్, ఫిమేల్, క్యాజువాలిటీ, హెచ్‌డీయూ, ఎస్ఎన్‌యూ విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఇటీవల పూర్తయిన భవనాలను నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణాలను తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో 2024–25 నుంచి మెడికల్ కాలేజీ ప్రారంభానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు గాను ఇక్కడ ఉన్న మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. కాలేజీ ప్రారంభానికి సాధ్యసాధ్యాల పట్ల అధికారులు ఉమ్మడిగా మెడికల్ ఆఫీసర్ కార్యాయంలో చర్చించారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో 150 పడకలతో ఉండగా, మెడికల్ కాలేజీ ప్రారంభించేందుకు 300 పడకలకు అనుమతి రావాల్సి ఉందన్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు తాత్కాలికంగా జిల్లా ఆస్పత్రిలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చుకునేందుకు తగిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఆర్ఎంఓ తెలిపారు. తాము పరిశీలించిన అంశాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేస్తామన్నారు. మెడికల్ కాలేజీ ప్రారంభంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. తమ పరిశీలనలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, కావాల్సిన సదుపాయాలపై నివేదిక వివరాలను పొందుపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్‌డీసీ ఇంజినీరింగ్ విభాగం డీఈలు కరీముల్లాఖాన్, చలపతి, ఏఈలు రాజేష్ రాఘవ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం మంజూరు

పీలేరు : మండలంలో రైతులకు రూ. 35.55 లక్షలు పంట నష్టపరిహారం మంజూరైనట్లు ఏడీఏ వై.వి. రమణరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 2022 ఖరీఫ్ సాగులో ప్రకృతి వైపరిత్యాలతో పంట నష్టం వాటిల్లిన 2478 మంది రైతులకు 3784 ఎకరాలకు గానూ రూ. 35.55 మంజూరైనట్లు తెలిపారు.



జిల్లాలో టూరిజం క్లబ్‌ల ఏర్పాటు

– డీటీఓ నాగభూషణం

బి.కొత్తకోట: విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచడం కోసం జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల్లో టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎం.నాగభూషణం అన్నారు. జిల్లాలో తొలిసారిగా శనివారం రాయచోటికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులతో బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌కు టూరిజం క్లబ్ పర్యటన నిర్వహించారు. రాయచోటి నంచి విద్యార్థులను మదనపల్లె పారిశ్రామిక వాడలోని ప్లాస్టిక్ వస్తువులను తయారుచేసే పరిశ్రమల వద్దకు తీసుకెళ్లి వస్తువుల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. అక్కడి నుంచి మండలంలోని హార్సిలీహిల్స్‌కు తీసుకొచ్చి కొండపై విశేషాలు, ఇక్కడి వాతావరణం, పర్యాటక విశేషాలను విద్యార్థులకు వివరించారు.

13న శ్రీహరికోటకు ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ: చంద్రయాన్–3 రాకెట్ లాంచింగ్ సందర్శించుటకు ఈనెల 13న ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ టు డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. మదనపల్లె ఉదయం 5.30 గంటలకు బయలుదేరి తిరుపతి సైన్సు సెంటర్, జూపార్కు, నేలపట్టు చూసిన తరువాత శ్రీహరికోటకు మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటుందన్నారు. రాకెట్ లాంచింగ్ తరువాత తరువాత పులికాట్ సరస్సు మీదుగా చెంగాలమ్మ గుడి, ఇస్కాన్ టెంపుల్, శ్రీనివాసమంగాపురం చూసిన తరువాత మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. టిక్కెట్లు ముందుగానే రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645ను సంప్రదించాలని కోరారు.

పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ప్రారంభం

మదనపల్లె : పశువుల్లో వచ్చే వివిధ రకాల వ్యాధులను నిర్ధారించడానికి ఏర్పాటుచేసిన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను రైతులందరూ ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మదనపల్లె నియోజకవర్గ స్థాయిలో స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో నిర్మించిన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతుబాంధవుడు, మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో జిల్లా కేంద్రానికే పరిమితమైన ఇలాంటి ప్రయోగశాలలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నియోజకవర్గంలో ఒక పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఉండాలనే ఉద్దేశంతో మదనపల్లెలో డాక్టర్.వైఎస్సార్ నియోజకవర్గస్థాయి పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఏడీ రోహిణి, విశ్వేశ్వరరెడ్డి, డాక్టర్.లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరుడికి మహాతైలాభిషేకం

వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పాలిమేర ధర్మపథంలో వెలసిన అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో శనివారం శనేశ్వరుడికి మహాతైలాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, పాలాభిషేకం, మహాతైలాభిషేకం నిర్వహించారు. జాతకరీత్యా ఏలినాటి అష్టమ, అర్ధాష్టమ, జన్మ, కంటక, వక్ర శని దోషలు ఉన్న వారు మహాతైలాభిషేకంలో పాల్గొంటే దోషాలు తొలుగుతాయని అర్చకులు శ్రీనివాసాచార్యులు తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

బి.కొత్తకోట: స్థానిక పీటీ ఎంరోడ్డులో శనివారం ఓ పిచ్చికక్క స్వైర విహారం చేసింది. వాయలవంకకు చెందిన అనురాధ (30) చింతల రామాంజులు ఇంటి వద్ద ఉండగా పిచ్చికుక్క ఇంటి ఆవరణలోని కోడిని కొరికి చంపుతుండగా చూసిన అనురాధ కుక్కను తరమబోయింది. అంతలో కుక్క అనురాధపై పడి కాళ్ల కింద, పలుచోట్ల కొరికింది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.





• జోహార్ వైఎస్సార్

మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజక వర్గాలోన్ని అన్ని మండలాల్లో శనివారం మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలను ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం, దుస్తుల పంపిణీ తదితర సేవాకార్యక్రమాలు చేపట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు మారుమోగాయి.

– సాక్షి నెట్‌వర్క్



వాల్మీకిపురం: అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే చింతల



తరిగొండలో నివాళులు అర్పిస్తున్న నాయకులు



కలికిరి : వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



పీలేరు: కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి తదితరులు



తంబళ్లపల్లె : వైఎస్సార్ జయంతి వేడుకలో నాయకులు



ములకలచెరువు : కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కలకడ: విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న సర్పంచ్ , తదితరులు



కురబలకోట : కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



కేవీపల్లె : గర్నిమిట్టలో వైఎస్సార్ జయంతి వేడుకలు



బి.కొత్తకోట : వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెద్దతిప్పసముద్రంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు



నిమ్మనపల్లె : వైఎస్సార్ చిత్రపటం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు



రామసముద్రం : వైఎస్సార్ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

వైభవంగా ఎల్లమ్మ జాతర



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న దృశ్యం

కలికిరి : కలికిరి గ్రామ దేవత ఎలమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. శనివారం సాయంత్రం ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి దంపతులు, రెడ్డివారి వంశీకులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం రమణాచారి ఇంటి వద్ద నుంచి తెచ్చిన నగలతో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి కథాకాలక్షేపం నిర్వహించారు. జాతర ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించనున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పీలేరు రూరల్ : ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. వినాయకం అన్నారు. శనివారం పట్టణంలోని కోటపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఎక్కడ అన్యాయం జరిగినా తాము ముందుంటామన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా సురేంద్ర, అధ్యక్షుడిగా సూర్యప్రకాష్, కార్యదర్శిగా వి. శ్రీరాములునాయక్, ఆర్థిక కార్యదర్శిగా ఎ. శ్రీనివాసులు, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా జి. రమణ, అదనపు కార్యదర్శిగా వెంకటరమణనాయక్, ఉపాధ్యక్షులుగా సుధాకర్, నాగార్జున, నాగరాజు, రమణ ఎన్నికయ్యారు.

విజనరీ లీడర్ వైఎస్సార్

- పేదల జీవితాల్లో వెలుగులు నింపిన దార్శనికుడు
- ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

మదనపల్లె : మహానేత వైఎస్సార్ విజనరీ లీడర్ అని, ఆయన భౌతికంగా మన మధ్యలేకపోయినా తన ఆనవాళ్లను వదిలివెళ్లి పేదల జీవితాల్లో వెలుగులు నింపి, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మహానేత వైఎస్సార్ 74వ వర్ధంతి సందర్భంగా శనివారం నియోజకవర్గవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని తట్టివారిపల్లెలోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమపథకాల సృష్టికర్తగా, జలయజ్ఞం అపరభగీరథుడిగా, 108, 104, ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్ తదితర సంక్షేమ పథకాలతో తెలుగురాష్ట్రాల్లోని ప్రతి ఒక్కరి మనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయిన జననేత వైఎస్సార్ అన్నారు. మార్కెట్‌యార్డులో చైర్‌పర్సన్ తట్టి శారదారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, వైస్ ఎంపీపీ డిష్‌రమణ, నందినితాజ్, సర్పంచ్‌లు సిద్ధలదీపా, వేమారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వెంకటరమణ, ఈశ్వరయ్య, గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డులో రైతులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, షమీంఅస్లాం తదితరులు